## మజ్జిగ కేంద్రం ప్రారంభం



**దశ, నేరేడుచర్ల న్యూస్:** నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని జాన్ పహాడ్ రోడ్డులో జగిని క్లాత్ స్టోర్స్ అధినేత జగిని సురేష్ శనివారం ఏర్పాటుచేసిన మజ్జిగ కేంద్రాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు రాచకొండ రామ్మోహన్ రావు, కొణతం నారాయణరెడ్డి, ఉప్పల కృపాకర్, మా శెట్ట మోహన్, వెంపటి వెంకన్న, గెల్లీ శ్రీనివాసరావు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలపై దూసుకెళ్లిన కోళ్ల వ్యాన్

**ప్రమాదంలో 40 గొర్రెల మృతి**



**దశ, మణుగూరు :** మణుగూరు పట్టణంలో శనివారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. సీఎస్పీ సమీపంలో తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో రోడ్డుపై గొర్రెలను మేపుకుంటూ వెళ్తుండగా, వేగంగా వచ్చిన కోళ్ల వ్యాన్ అదుపుతప్పి గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుమారు 40 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనతో గొర్రెల యజమానికి భారీ నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న స్థానికులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెరువులో స్నానానికి దిగిన శ్రీవిజ్ఞాన్ స్కూల్ విద్యార్థి హర్ష వర్ధన్ గల్లంతు

❖ *విచారణ జరుపుతున్న మణుగూరు సీఐ నాగబాబు*



**దశ, మణుగూరు :** మణుగూరు మండలంలో గల శ్రీ విజ్ఞాన్ పాఠశాలకు చెందిన రేగులగండి చెరువు వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈతకు వెళ్లిన ముగురు విద్యార్థులు బొర్రా శశిధర్, పేరూరి గిరిధర్, హర్షవర్ధన్ అనే ముగ్గురు విద్యార్థులు పాఠశాల నుండి రేగుల గండి చెరువులో స్నానానికి దిగారు. ముగ్గురిలో ఒకరైన హర్షవర్ధన్ చెరువులో గల్లంతయ్యాడు. మిగిలిన ఇద్దరు విద్యార్థులు ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మణుగూరు సీఐ నాగబాబు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. విద్యార్థి గల్లంతు కావడంతో విద్యార్థి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

# ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ప్రజలకు షేడ్ నెట్ ఏర్పాటు

❖ *పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన*

❖ *ప్రధాన ప్రదేశాల్లో సమ్మర్ వాటర్ పాయింట్లు..:నల్గొండ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర*



**దశ, నల్గొండ :** ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు షేడ్ నెట్ ఏర్పాటు చేయుటకు అనువైన ప్రదేశాలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించి సోమవారంలోగా పూర్తి చేయాలని నల్గొండ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర ఆదేశించారు. శనివారం అన్ని శాఖల అధికారులు, ఇంజినీరింగ్, రెవెన్యూ, శానిటేషన్ సిబ్బంది, వార్డు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, ఆదాయ వృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై కమిషనర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అదేవిధంగా పట్టణంలోని ప్రధాన ప్రదేశాల్లో సమ్మర్ వాటర్ పాయింట్లు (చలివేంద్రాలు) వెంటనే ఏర్పాటు చేసి ఈరోజు నుంచే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

పట్టణంలోని అన్ని శ్మశాన వాటికలలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే పట్టణంలోని ఓపెన్ జిమ్‌లను గుర్తించి మరమ్మతులు, ఆయిలింగ్, గ్రీసింగ్, బోల్ట్ ఫిట్టింగ్ తదితర పనులు చేపట్టి వారం రోజుల్లో ప్రజల వినియోగానికి సిద్ధం చేయాలని సూచించారు. రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్, ఆస్తిపన్నుపై 5 శాతం రిబేట్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా వార్డు అధికారులు ప్రజలను ప్రోత్సహించాలని ఆదేశించారు. అలాగే అండర్ అసెస్‌మెంట్ మరియు అన్ అసెస్‌మెంట్ ఆస్తులను గుర్తించి సైట్ రివిజన్ నిర్వహించి పన్ను పరిధిలోకి తీసుకురావాలని, డోర్ నంబర్లు లేని ఇళ్లను గుర్తించి వెంటనే డోర్ నంబర్లు కేటాయించి పన్ను వసూళ్లు చేపట్టాలని సూచించారు.

అదేవిధంగా ట్రేడ్ లైసెన్సులు, నీటి పన్ను వసూళ్లు, పెన్షన్ దరఖాస్తులు సహా సంబంధిత వార్డుకు సంబంధించిన అన్ని పనులు సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజా ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమిషనర్ స్పష్టం చేశారు. నల్గొండ మునిసిపల్ కార్పొరేషన్ ఆదాయ వృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రెవెన్యూ పెంపు దిశగా కృషి చేయాలని, అదే సమయంలో ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. అవసరమైన చోట శాఖల మధ్య సమన్వయం పెంచి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. రాములు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి. అశోక్, కార్తీక్, అసిస్టెంట్ ఇంజనీర్లు దిలీప్, అసీం బాబా, ప్రవీణ్, శానిటరీ సూపర్వైజర్ జి. శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ రెడ్డి, రెవెన్యూ అధికారి శివరాం రెడ్డి, టీఎంసీ శ్రీనివాస్, వార్డు అధికారులు పాల్గొన్నారు.



## హౌస్ లిస్టింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

❖ *జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్*

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** జిల్లాలో జన గణన 2027 కార్యక్రమంలో భాగంగా మొదటి విడత శిక్షణా కార్యక్రమము జడ్.పి.హెచ్.ఎస్, నూతనకల్ లో జరుగుతున్నందున జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరై జన గణన నిర్వహించే న్యూమరేటర్స్, సూపర్వైజర్స్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని తగు సూచనలు జారీ చేశారు. మొదట విడతగా హౌస్ లిస్టింగ్ చేయవలసి ఉన్నందున ఏ ఒక్క గృహము కూడా వదిలిపెట్టకుండా ప్రతి వీధిలో ఆ చివరి నుండి ఈ చివరి వరకు మధ్యలో గృహాలను వదిలేయకుండా హౌస్ లిస్టింగ్ పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. CMMS పోర్టల్ నందు మొబైల్ అప్లికేషన్ ద్వారా పూర్తి చేయవలెనని కోరినారు. తదుపరి ఆశా వర్కర్లతో మాట్లాడి గ్రామములో ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసు కున్నారు. గ్రామములో అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి సూచించినారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోటి రూపాయల ఇన్స్యూరెన్స్ చెక్ అందించిన జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్




❖ *పోలీస్ సాలరీ ప్యాకేజీ SBI బ్యాంక్ అంకౌంట్ ఇన్స్యూరెన్స్ ద్వారా 1 కోటి రూపాయల ఇన్స్యూరెన్స్ చెక్*

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** నూతనకల్ పోలీస్ స్టేషన్ నందు పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో అకాలంగ మరణించిన కానిస్టేబుల్ సోమాని నాయక్ కుటుంభానికి స్టేట్ బ్యాంక్ పోలీస్ సాలరీ ప్యాకేజీ ద్వారా ఒక కోటి రూపాయల సాలరీ ప్యాకేజ్ SBI ఇన్స్యూరెన్స్ చెక్ ను ఈరోజు జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ తన కార్యాలయం నందు అందించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పోలీసు లకు ప్రత్యేక సాలరీ ప్యాకేజీ ఇవ్వడం జరిగినది. పోలీసు సిబ్బంది మరణించిన క్రమంలో ఈ పోలీస్ సాలరీ ప్యాకేజ్ అకౌంట్ ద్వారా 1 కోటి రూపాయల ఇన్స్యూరెన్స్ అందిస్తుంది. ఈ స్కీం ద్వారా ఈరోజు సోమాని కుటుంబ సభ్యులకు రూ.1 కోటి చెక్కు అందజేయడం జరిగినది అని, ఈ స్కీం పోలీసు కుటుంబాలకు ఎంతగానో ఆర్థిక బాసటగా నిలుస్తుంది అని ఎస్పి అన్నారు. సిబ్బంది అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి, ప్రమాదాలకు దూరంగా ఉండాలి, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ఈ స్కీంను రూపొందించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి అభినందనలు తెలిపినారు. ఇదే కార్యక్రమం నందు పోలీసు భద్రత ఇన్స్యూరెన్స్ చెక్క ను అందించడం జరిగినది. భద్రత స్కీం సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమం నందు AO మంజు భార్గవి, డిసిఆర్బి డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఆర్మడ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మాగ్దూం అలి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు మోహన్ కుమార్, రఘురాం, వివిఆర్ మూర్తి, కుటుంబ సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

# ధాన్యం కొనుగోలు సజావుగా నిర్వహించాలి



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్ళను వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం జిల్లాలోని ఆత్మకూరు (ఎస్) మండలం నెమ్మికల్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి తదుపరి నూతనకల్ మండలం గుండ్ల సింగారం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను రిబ్బన్ కట్ చేసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సజావుగా నిర్వహించేందుకు వ్యవసాయ, సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున 340 సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని మౌళిక వసతులతో పాటు తేమ కొలిచే యంత్రాలు, టార్ఫలిన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం ఒక్కరోజే 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, రానున్న రోజులలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రోజుకు 5 వేల మెట్రిక్ టన్నుల నుండి 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ ప్రవీణ్, డి.ఎం. సివిల్ సప్లయస్ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు ఆత్మకూరు, నూతనకల్లు మండల తహసీల్దారులు అమీన్ సింగ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో హసీం, సునీత లు ఇతర అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కార్తీక రెడ్డిని తార్నాక లోని ఆమె నివాసంలో ముందస్తుగా హౌస్ అరెస్ట్..

**దశ, ఓయూ :** తాము మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని చెపుతూనే కాంగ్రెస్ పార్టీ బిల్లును ఆమోదం పొందకుండా చేసిందని మాజీ మేయర్ బిజెపి సీనియర్ నాయకురాలు బండ కార్తీక రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ తీరును నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడికి తెలంగాణ బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో కార్తీక రెడ్డిని తార్నాక లోని ఆమె నివాసంలో ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లును కేవలం వ్యతిరేకించదంలేదని చెపుతూనే, అమలు దశకు వచ్చినప్పుడు దొంగనాటకాలతో అడ్డుకుందని ఆమె విమర్శించారు. సామాన్య మహిళలు రాజకీయాలలో రాకూడదని, కేవలం గాంధీ కుటుంబ మహిళలు మాత్రమే రాజకీయాలలో ఉండాలనే ఉద్దేశంతో బిల్లును వ్యతిరేచారని ఆరోపించారు. 17ఏప్రిల్ 2026 చీకటి రోజు అన్నారు. ఈ కార్యక్రమంలో తార్నాక డివిజన్ బిజెపి అధ్యక్షులు రవీందర్ యాదవ్, వీరన్న,కేదారం, తదితరులు పాల్గొన్నారు.

# గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్
# కమిటీ చైర్మన్ పై 10కోట్ల పరువు నష్టం దావా

❖ లీగల్ నోటీసులు పంపిన "మాజీ చైర్మన్ డాక్టర్ వీరమళ్ళ రామ్ నరసింహ గౌడ్"



**దశ, రంగారెడ్డి:** గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చివరి మార్కెట్ కమిటీ చైర్మన్ గా పనిచేసిన డాక్టర్ రామ్ నరసింహ గౌడ్ పైన చేసిన అవినీతి మరియు వక్తిత్వన్నీ హననం చేసిన ప్రస్తుత గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి పైన పదికోట్ల పరువు నష్టం వేసినాట్లు డాక్టర్ రామ్ నరసింహ గౌడ్ తెలిపారు.

ఈ సందర్బంగా రామ్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ మార్కెట్ పరిధిలో వచ్చే అప్పటి ప్రజా ప్రతినిధులు సబితా ఇంద్రరెడ్డి, మల్లారెడ్డి,మంచి రెడ్డి కిషన్ రెడ్డి,సుదీర్ రెడ్డి,సుభాష్ రెడ్డి,ఎంపీలు ఏనుముల రేవంత్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, రంజిత్ రెడ్డి నూతన లైసెన్స్ లు రైతులకు, వ్యాపారస్తులకు ఇవ్వాలని వాళ్ళు ఇచ్చిన సిపారసుల లెటర్స్ ప్రకారం మరియు "మార్కెట్ కమిటీ తీర్మానం చేసిన తర్వాత తెలంగాణ రాష్టంలో ఉన్న మార్కెట్ కమిటీలు ఇచ్చిన విధంగా ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కానీ మా పాలకవర్గం సభ్యులు , ప్రభుత్వంలో ఉన్న ప్రజా ప్రతినిధులు, కొంతమంది ఉద్యోగ సంఘము నాయకులు మార్కెట్ పైన మరియు బలహీన వర్గాలకు చెందిన నా పైన చేసిన కుట్ర మరియు ఆధిపత్యం పోరులో నైతిక విలువలకు కట్టుబడి నా యొక్క చైర్మన్ పదవికి రాజీనామా చేస్తు అప్పటి ముఖ్యమంత్రి గౌరవ కెసిఆర్ గారికి లేటర్ ఇవ్వడం జరిగినది కానీ నా విశ్వాసనియత పరిగణలోకి తీసుకోని నా రాజీనామాను అమోదించ లేదు అని అయన తెలిపారు. చిల్లర మధుసూదన్ రెడ్డి మార్కెట్ సిబ్బందిని మరియు మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులను, వ్యాపారస్తులను అనాదికారికంగా ఆర్థిక లావాదేవీలా విషయం లో బెదిరించడం,నీవు మార్కెట్ కమిటీ కార్యాలయం నుండి అనధికారికంగా తీసుకున్న సస్పెండ్ జీవో(2021) కాపీని సోషల్ మీడియాలో పెట్టినావు , కానీ నాపైన దుష్ప్రచారం చేసిన దానిలో ఉన్న అసలు విషయాన్ని దాచి పెట్టి కూడా "అవినీతి జరిగినది" అని ప్రచారం చేశారన్నారు. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని రైతులు, వ్యాపారస్థులు నూతన లైసెన్స్ కు చేలించిన ఫీజు మార్కెట్ బ్యాంకు లో జమ అయింది అనే విషయం తెలిసి కూడా చిల్లర మధుసూదన్ రెడ్డి నాపై నిరాధారన అవినీతి ఆరోపణలు మరియు వక్తిగతంగా బలహీనమైన ఆరోపణలు చేయడం మరియు తన అనుచరుల ద్వారా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ఆయన అహకారం నికి నిదర్శనమని అన్నారు.

కోవిడ్ సమయంలో "కోహెడ పండ్ల మార్కెట్ తాత్కాలిక నూతన షెడ్ల నిర్మాణం పాలకవర్గం తీర్మానం మేరకు జరిగింది కొన్ని రోజులు మార్కెట్ సవ్యగా నడిచిన తర్వాత అనుకోకుండా రాళ్ల వర్షం, ఇదురుగాలిలతో పకృతి వైపళ్యంతో కూలిపోవడం జరిగింది అనే విషయం తెలిసి కూడా మాజీ మంత్రి హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, సుదీర్ రెడ్డి,మంచి రెడ్డి కిషన్ రెడ్డి గార్లు మరియు నా పైన నిరాధార ఆరోపణలు చేశారన్నారు. అదేవిదంగా భాటసింగారం పండ్ల మార్కెట్ చేలిస్తున్న అద్దె విషయంలో చేసిన ఆరోపణలు ఆయన రాజకీయ అజ్ఞానికి నిదర్శనం అని అన్నారు.

పైన తెలిపిన అని విషయాలు నా యొక్క రాజకీయ, న్యాయవాద, సామాజిక మరియు "బిఆర్ఎస్ పార్టీ లో 25 సంవత్సరాలుగా కెసిఆర్ గారి నాయకత్వంలో క్రమశిక్షణ గల కార్యాకర్తగా పనిచేస్తు ప్రజలలో ఉన్న నా పరువు ప్రతిష్ట అంశాలు పైన తీవ్ర ప్రభావం పడుతున్నాదని వెంటనే తను చేసిన నిరాధారణ ఆరోపణలు పైన నా న్యాయవాది ద్వారా లీగల్ నోటీసులు పంపించడం జరిగిందని వెంటనే వారం రోజులో బేషరతుగా భహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిచో "చిల్లర మధుసూదన్ రెడ్డి పైన పదికోట్ల పరువు నష్టం" దావ మరియు క్రిమినల్ కేసులు వేస్తునట్లు ఆయన తెలిపారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

❖ 350 హెల్మెట్లను అందజేసిన సెవెన్ స్టార్ సోలార్ ఎంటర్ప్రైజెస్ ఎండి రావుల మల్లేష్




**దశ, సూర్యాపేట ప్రతినిధి :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ నర్సింహ తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్' కార్యక్రమం లో భాగంగా సెవెన్ స్టార్ సోలార్ ఎంటర్ప్రైజెస్ ఎమ్.డి రావుల మల్లేష్ జిల్లా ఎస్పీ నర్సింహకు సుమారు 2 లక్ష 50 వేలు రూపాయలు విలువ గల 350 హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని తెలిపారు. అడగగానే సామాజిక బాధ్యతగా 350 హెల్మెట్లను అందజేసిన రావుల మల్లేష్ ను అభినందించి శాలువాతో సన్మానించారు.

## సూర్యాపేట ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** ప్రజా పాలన ప్రగతి పాలనలో భాగంగా సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ వి.సునీత ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేట పబ్లిక్ స్కూల్ నందు విద్యార్థులకు రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సూర్యాపేట టూ టౌన్ ఎస్.ఐ శివతేజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, ముఖ్యంగా విద్యార్థులు చిన్నతనం నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు ప్రసన్న మరియు ధనుశ్రీలను ఎంపిక చేసి, ఎస్.ఐ చేతుల మీదుగా వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) బి. సైదులు, ఆర్టీసీ సూపర్వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**దశ, మణుగూరు :** మణుగూరులో వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సామాజిక కార్యకర్త న్యాయవాది కర్నే రవి సూచించారు. శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన ఏప్రిల్ 18 నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించినందున పిల్లలు ఎక్కువ సమయం బయట గడిపే అవకాశముందని తెలిపారు. ఈ క్రమంలో సరదా కోసం చెరువులు, కుంటలు, కాలువలు వంటి ప్రమాదకర ప్రాంతాలకు పిల్లలు ఒంటరిగా వెళ్లకుండా తల్లిదండ్రులు కట్టుదిట్టమైన పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. ప్రత్యేకంగా ఈత రాని పిల్లలు నీటిలోకి దిగితే ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటీవల చోటుచేసుకుంటున్న ప్రమాదాల దృష్ట్యా అప్రమత్తత ఎంతో అవసరమని పేర్కొన్నారు. పిల్లల భద్రతే ముఖ్యమని, వారిని సురక్షితంగా ఉంచడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని కర్నేరవి స్పష్టం చేశారు.

## విద్యార్థి హర్షవర్ధన్ మృతి పై సమగ్ర విచారణ జరిపించాలి

❖ 50 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలి
❖ ప్రత్యేక తరగతులను చెప్పి పట్టించుకోకపోవడం ఏంటి?
❖ పిడిఎస్యూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్

**దశ, మణుగూరు :** ప్రత్యేక తరగతుల పేరుతో వేసవి సెలవుల్లో విద్యార్ధలకు క్లాసుల నిర్వహించడంతో పాటు విద్యార్థులు చెరువులో విద్యార్థులు ఈతకు వెళ్లి ఒక విద్యార్థి మృతి చెందడానికి కారణమైన శ్రీవిజ్ఞాన్ స్కూల్పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్యూ జిల్లా అధ్యక్షులు బీ. వీరభద్రం, జిల్లా కార్యదర్శి మునిగెల ప్రశాంత్లు డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మణుగూరు పట్టణ కేంద్రంలోని గట్టు మల్లారం శ్రీ విజ్ఞాన్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న హర్షవర్ధన్ అనే విద్యార్థి , మరో ఇద్దరు స్నేహితులతో సమీపంలోని రేగులగండి చెరువుకు ఈతకు వెళ్లగా ముగ్గురిలో హర్షవర్ధన్ మరణించాడు. ఒంటిపూట బదుల నడుస్తుండగా పాఠశాల యాజమాన్యం ఇండ్లకు ఫోన్లు చేసి సాయంత్రం 4 గంటల వరకు పదవ తరగతి క్లాస్ నిర్వహిస్తున్నామని చెప్పడంతో, ఒంటిపూట బదులసమయంమధ్యాహ్నంవరకేఅయినా,పదవతరగతివిద్యార్థులకు ప్రత్యేక క్లాసులు దృష్ట్యా తల్లిదండ్రులు సమయం మించిపోయినప్పటికీ తిరిగి ఫోన్ చేయలేదు. ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నామని చెప్పిన యాజమాన్యం విద్యార్థులను గాలికొదిలేసింది. ఒంటిపూట బదుల నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ముగ్గురు విద్యార్థులు ఈతకు వెళ్లగా హర్షవర్ధన్ మరణించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని, గుర్తింపు రద్దు చేయాలని, విద్యార్థి తల్లిదండ్రులకు తగు నష్టపరిహారం చెల్లించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యూ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది.

## ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఉత్సవాలు జయప్రదం చేయండి



**దశ, నేరేడుచర్ల న్యూస్:** మే 1వ తేదీన జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవం వేడేను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు. శనివారం నాడు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల ముఖ్యుల సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా మే ఒకటవ తేదీ మేడే ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకుంటారని ఎనిమిది గంటల పని విధానం కొరకు అమెరికా నగరంలో ప్రారంభమైన కార్మిక సమ్మె ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి నాటి పాలకుల మెడలు ఉంచి 8 గంటల పని దినాలు సాధించుకున్న గొప్ప రోజు మేడే అని ఆయన అన్నారు.

కానీ భారతదేశంలో ఇటీవల కాలంలో అధికారంలో వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం మళ్ళీ పది గంటల పని విధానాన్ని అమలు చేస్తున్నదని ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగుకోడ్ లుగా కుదించి కార్మిక హక్కులను హరించి వేశారని ఈనాడు కార్మికులకు సంఘం పెట్టుకునే అవకాశాలు లేవని సమ్మె చేసే హక్కు లేకుండా చేశారని అందువల్ల దేశవ్యాప్తంగా ఉన్న సంఘటిత... అసంఘటిత రంగంలోని కార్మికులు ఐక్యమై కేందంలో అధికారం ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించిన రోజే కార్మికులకు నిజమైన మేడే అని ఆయన అన్నారు.

నిన్న పార్లమెంట్లో డీ లిమిటేషన్ బిల్లును మహిళా బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి దిమ్మ తిరిగి బొమ్మ కనిపించిందని రానున్న రోజుల్లో కూడా ఇండియా కూటమి చేతిలో ఎన్డీఏ కూటమికి పరాభవం తప్పదు అని ఆయన జోష్యం చెప్పారు. ఈ సమావేశంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ A. లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్, శీలం రాంబాబు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు కాంగ్రెస్ అడ్డుగోడ




❖ బీజేపీ నేత గోపాల్ గౌడ్

**దశ, ఓయూ:** పార్లమెంటులో 33% మహిళా రిజర్వేషన్ బిల్లుకు (131వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2026) వ్యతిరేకంగా ఓటు వేసిన కాంగ్రెస్ పార్టీ మరియు 'ఇండి' కూటమి వైఖరిని తీవ్రంగా ఖండించటం జరిగింది. పార్లమెంటులో జరిగిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఓటింగ్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన తీరు ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని బీజేపీ నాయకులు గోపాల్ గౌడ్ మండిపడ్డారు.

దేశంలోని కోట్లాది మంది మహిళల దశాబ్దాల కలను సాకారం చేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తుంటే, కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం దాన్ని అడ్డుకోవడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు.

మహిళా వ్యతిరేక పార్టీ కాంగ్రెస్ 33% మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా, కాంగ్రెస్ పార్టీకి మహిళా సాధికారతపై ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని గోపాల్ గౌడ్ విమర్శించారు. అభివృద్ధికి విఘాతం: కేవలం రాజకీయ ఉనికి కోసం దేశాభివృద్ధిని, సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్ అడ్డుకుంటోందని, 'నారీ శక్తి' పట్ల వారికి గౌరవం లేదని ఈ ఓటింగ్ ద్వారా స్పష్టమైందని ఆయన ఆరోపించారు. చారిత్రక అవకాశం చేజార్చారు దేశ అత్యున్నత సభలో మహిళలకు ప్రాతినిధ్యం పెంచే చారిత్రక అవకాశాన్ని కాంగ్రెస్ తన సంకుచిత రాజకీయాలతో అడ్డుకుందని, దీనికి ఆ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.


### ప్రజలే బుద్ధి చెబుతారు

మహిళా లోకం ఈ విషయాన్ని గమనిస్తోందని, రాబోయే రోజుల్లో మహిళలే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని గోపాల్ గౌడ్ పేర్కొన్నారు.

నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించే వరకు తన పోరాటాన్ని ఆపదని, కాంగ్రెస్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా మహిళా సాధికారత సాధించి తీరుతామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## నిప్పుల కుంపటిగా ఆదిలాబాద్

42 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటిన ఉష్ణోగ్రత హడలెత్తుతున్న ప్రజలు




**దశ, ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ జిల్లాలో ఎండలు భగ్గుమంటున్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. జిల్లాలో పలుచోట్ల 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతూ గర్మీ తన ఉగ్రరూపాన్ని చూపుతోంది. ఆసిఫాబాద్ పట్టణంలో గరిష్టంగా 43.9డిగ్రీల సెంటీగ్రేడ్లు నమోదు కాగా, కాగజ్నగర్, బెజ్జూర్ ప్రాంతాల్లో 43.3డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు చేరాయి. రెబ్బెనలో 41.1డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదైంది. ఇతర మండలాల్లోనూ 43 డిగ్రీలు దాటిన ఎండలతో ప్రజలు తల్లడిల్లుతున్నారు. ఉదయం నుంచే మండుతున్న ఎండ తీవ్రతతో జనజీవనం స్థంభిస్తోంది.

### రహదారులు నిర్మానుష్యం

వేడి గాలులు, కరాళమైన ఎండలతో మధ్యాహ్నం వేళ రహదారులు వెలవెలబోతున్నాయి. అత్యవసర పనులుంటే తప్ప బయట అడుగు పెట్టేందుకు ప్రజలు వెనుకాడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### డాక్టర్ల హెచ్చరికలు... నీరే ప్రాణాధారం!

వైద్యులు ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు. దాహం లేకపోయినా తరచుగా నీరు తాగాలని, రోజుకు కనీసం రెండు గ్లాసుల అదనపు నీరు తీసుకోవాలని సూచిస్తున్నారు. తలకు గుడ్డలు, టోపీలు ధరించడం, ఎండలో ఎక్కువసేపు ఉండకపోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పరిస్థితి మరింత భయంకరంగా మారింది. ఉదయం 10 గంటల తర్వాత బయటకు వెళ్లడం అంటే నిప్పుల కుంపటిలోకి అడుగు పెట్టినట్టే ఉంది. 42-43 డిగ్రీల సెంటీగ్రేడ్ మధ్య ఉష్ణోగ్రతలతో ప్రజలు హడలెత్తుతున్నారు.

### కూలర్లు, ఫ్రిడ్జ్లకు డిమాండ్ జోరు

ఎండ తీవ్రత తట్టుకోలేక ప్రజలు కూలర్లు, ఫ్రిడ్జ్ల కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. ఎలక్ట్రానిక్స్ దుకాణాలు కస్టమర్లతో కిటకిటలాడుతున్నాయి.

### గొడుగు, రుమాలు... తప్పనిసరి ఆయుధాలు

ఇంటి బయటకు రావాలంటే తలకు రుమాలు, చేతిలో గొడుగు తప్పనిసరిగా మారింది. ఇవే ప్రజలకు తాత్కాలిక ఉపశమనం ఇస్తున్నాయి.

### చల్లటి పానీయాలకే ఆదరణ

చెమటలు కారుస్తున్న ఎండలో ప్రజలు చల్లటి నీరు, శీతల పానీయాలపై ఆధారపడుతున్నారు. బాటిల్ వాటర్కు భారీ డిమాండ్ పెరిగింది.

### మాయం అయిన చలివేంద్రాలు

గతంలో కనిపించిన చలివేంద్రాలు ఈసారి కనిపించకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోంది. దాహార్తి తీర్చే చర్యలు లేకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఈ తీవ్ర ఉష్ణోగ్రతలు మరికొన్ని రోజులు కొనసాగనున్నాయి. ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలు అగ్నికుండాలుగా మారుతున్న వేళ... ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.